## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరాలు



ఉత్తరపాలెంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

**వీరవాసరం:** కొణితివాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఉత్తరపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు సంఖ్య పెరిగిపోవడంతో ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సర్వే చేస్తున్నట్టు సర్పంచ్ కోడె వరలక్ష్మి తెలిపారు. కోడె అప్పారావు, కోడె వీరన్న, కార్మూరి కుమార్ పాల్గొన్నారు.

### సివిల్ రైట్స్ డే

**వీరవాసరం:** విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎస్సై పి.రమేష్ అన్నారు. స్థానిక యానాదులు కాలనీలో సోమవారం ఆయన సివిల్ రైట్స్ డే నిర్వహించారు. విద్యాహక్కు, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ చికిలే మంగతాయారు, న్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా క్యాపింగ్ గ్రాడ్యుయేషన్

**సాక్షి, భీమవరం:** స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని మదర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో సోమవారం క్యాపింగ్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆపరేటివ్ జిల్లా రిజిస్టర్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైందని విద్యాభ్యాసం పూర్తయిన తరువాత సేవా దృక్పథంతో రోగులకు సేవలందించాలన్నారు. నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్ రాంబాబు, ఏఓ నాగేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ ఎస్ నాగేశ్వరరావు, ఫ్యాకల్టీ సరళాదేవి పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

**పాలకోడేరు:** అవినీతికి పాల్పడుతోన్న మోగల్లు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ నలుగురు వార్డు మెంబర్లు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పెన్మెత్స వెంకటరాజు, బలే చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

### వాలీబాల్ తగాదాపై కేసులు

**ఉండి:** వాలీబాల్ ఆట సమయంలో ఏర్పడ్డ తగాదా నేపథ్యంలో ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేశామని ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు. ఉండి నిమ్మలపేటలో వాలీబాల్ ఆడుతున్న సమయంలో జరిగిన గొడవ నేపథ్యంలో వాలీబాల్ చూసేందుకు వచ్చిన అంబళ్ల నాని అనే వ్యక్తి, మరికొందరు క్రికెట్ బ్యాట్‌తో తనను కొట్టి గాయపర్చారని బాలాజీరావుపేటకు చెందిన కొమ్మన పవన్‌సాయి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడన్నారు. అలాగే.. కొమ్మన పవన్‌సాయి అనే వ్యక్తి, మరి కొందరు పాతగొడవల నేపథ్యంలో తనను కర్రతో కొట్టి గాయపర్చారని కొండ్రోతుపేటకు చెందిన అంబళ్ల హేమ్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఇరువురు వ్యక్తులూ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసులు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

### కాంట్రాక్ట్ ఉద్యోగిని వేధిస్తున్న కార్యదర్శి

**పాలకోడేరు:** మోగల్లు పంచాయతీలో కాంట్రాక్టు ఉద్యోగి టాంక్ వాచర్ వేడంగి వెంకటేశ్వర్లును వేధిస్తోన్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వార్డ్ మెంబర్ బలే చిట్టిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వర్లు దళితుడయినందు వల్లే సరిగ్గా పని చేయడం లేదని తాను ఫిర్యాదు చేసినట్టుగా పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారని తెలిపారు. తప్పుడు పేర్లతో దళిత ఉద్యోగిని వేధిస్తున్న మోగల్లు పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని చిట్టిబాబు కోరారు. వాస్తవానికి తాను వెంకటేశ్వర్లుపై ఫిర్యాదు చేయలేదని చిట్టిబాబు వివరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**కాళ్ల:** చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం గంజామ్ జిల్లాకు చెందిన సురేంద్ర బెహ్రా (60) కాళ్ల మండలం కోలనపల్లిలోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ కుటుంబంతో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న బెహ్రా ఈనెల 29న బాత్రూమ్‌లో పడిపోయాడు. దీంతో బెహ్రాను కుటుంబ సభ్యులు ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెహ్రా భార్య వామ్‌సాయి బెహ్రా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై మూర్తి తెలిపారు.

### జూదరుల అరెస్ట్

**ఉండి:** మండలంలోని కలిసిపూడిలో సోమవారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, రూ.10,430, ఉండి రైల్వే స్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గుర్ని అరెస్ట్ చేసి రూ.9150 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామన్నారు.

**మద్యం స్వాధీనం**

**ఉండి:** మండలంలోని చిలుకూరు గ్రామంలో మహదేవపట్నం గ్రామానికి చెందిన బొక్కా రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణాప్రియ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

# పథకాలతో ప్రజల ఆర్థికాభివృద్ధి

**డీసీసీబీ చైర్మన్ పీవీఎల్**

**కాళ్ల:** సంక్షేమ పథకాలు అందుకుంటూ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో సీఎస్ఐ చర్చి నుంచి సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందుతోన్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారిగా వారు అందుకున్న సంక్షేమ లబ్ధిని వివరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్య తరగతి పిల్లలు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. న్నార న్నారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. చంద్రబాబు 2014లో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. టీడీపీ హయాల్లో ఒక్క పేదవాడికి కూడా ఇల్లు లేదా స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి పేదవాడికీ ఇల్లు ఇవ్వాలనే ఉద్దేశంతో 32 లక్షల పేదలకు స్థలాలు ఇచ్చారని చెప్పారు. ఏలూరుపాడు గ్రామ ప్రజలంతా సంక్షేమ పథకాలతో సంతృప్తి చెందారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ భూపతి రాజు జగ్గారాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, గ్రామ ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, పార్టీ గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, మంతెన రామకృష్ణంరాజు, దాట్ల బాపిరాజు, బండ్రెడ్డి ఆది, పడమటి సుబ్బయ్య, దాట్ల భద్రిరాజు, కొండా రమణ, కోన రంజిత్, సీహెచ్ అశోక్ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరుపాడులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న పీవీఎల్



టీం జగనన్న సభ్యులకు సర్టిఫికెట్ అందిస్తున్న పీవీఎల్

**నేడు ఏలూరుపాడులో రెండో రోజు**

కాళ్ల మండలం ఏలూరుపాడు సచివాలయం–2 పరిధిలో మంగళవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను, పార్టీ శ్రేణులను కోరారు.

**ఉత్సాహంగా టీం జగనన్న**

**కాళ్ల:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ మంచి పరిపాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న టీం జగనన్న సభ్యులను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అభినందించారు. ఉండి నియోజకవర్గానికి చెందిన 30 మంది సభ్యుల్లో మొదటి ఐదుగురికి ఏలూరుపాడు గ్రామంలో సోమవారం ప్రశంసా పత్రాలను పీవీఎల్ అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

### నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

**ద్వారకాతిరుమల :** శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఉండి మండలం అగ్రహారానికి చెందిన దేవరకొండ ఎ.శ్రీకాంత్, ఎస్ఎల్ ప్రియాంక దంపతులు సోమవారం రూ. 1,00,200 విరాళంగా అందజేశారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు.

### కంచాల పంపిణీ

**ఉండి:** స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ సభ్యుడు కూనపరాజు రామరాజు ఆర్థిక సాయంతో సోమవారం కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ భవితా కేంద్ర విద్యార్థులకు త్వరలోనే బీరువా కూడా అందజేయనున్నట్టు చెప్పారు. క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా

**సాక్షి, భీమవరం:** విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరాటం 900 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక ఆదివారం బజార్ రోడ్డు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ అనేక మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్మాలని చూస్తోందని ఆరోపించారు. ఫ్యాక్టరీ ప్రైవేటు విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు.

# సర్వే చేసి, ఇళ్ల ప్లాన్ అప్రూవల్ చేయాలి

**ఛైర్‌పర్సన్ జామి హైమావతి**

**ఆకివీడు:** అప్‌గ్రేడ్ అయిన స్థానిక నగర పంచాయతీ పరిధిలో సర్వే చేసి, ఇళ్ల నిర్మాణాల ప్లాన్ అప్రూవల్ ద్వారా ఆదాయం పెంచాలని ఛైర్‌పర్సన్ జామి హైమావతి టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. స్థానిక నగర పంచాయతీ సమావేశపు హాలులో సోమవారం ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షతవహించి మాట్లాడారు. స్థానిక వాటర్ వర్క్స్ వద్ద వృధా ఉన్న మట్టి ఇసుకను లోతట్టుగా ఉన్న స్థానిక బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలోకి తరలించామని, మట్టి ఇసుకను అమ్ముకోలేదని వివరించారు. కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ 2005 టౌన్ ప్లానింగ్ ప్రకారం సర్వే చేసి ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని అధికారులను కోరారు. పట్టణంలోని డ్రెయినేజీలపై ఆక్రమణలను తొలగించి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ కోరారు. ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కి కోరారు. మరో కౌన్సిలర్ చెబితే తన వార్డులో పని చేయడం దారుణమని కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు వాపోయాడు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ విద్యార్థులు, దళితపేటలోని ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫిల్టర్ బెడ్లలో తీసివేసిన మట్టి ఇసుకను తరలించినట్టు చెప్పారు. పారిశుద్ధ్యం పనులు మెరుగు పరచాలని, విద్యుత్ దీపాలు వేయాలని, పలు స్థానిక సమస్యలపై కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ జి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ కార్మికులు తగినంతమంది లేరని, అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుపరుస్తామని వివరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, చీఫ్‌విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు గేదెల అప్పారావు, మోటుపల్లి కుమారి, తిమ్మారెడ్డి మాధవి, అస్రవున్నీషా బేగం, కటికతల జాన్‌వెస్లీ, గుండుగొలను సావిత్రి, ప్రతిపక్ష కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, మోపిదేవి సత్యవతి, బత్తుల శ్యామల, గుర్రాని నాగలక్ష్మి, గోపిశెట్టి సత్యవతి, బొల్లా శ్వేత, ప్రసన్న, టౌన్‌ప్లానిగ్ సూపర్‌వైజర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ హైమావతి

# క్రైస్తవ సంఘాల నిరసన ర్యాలీ



వీరవాసరం సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**వీరవాసరం:** మణిపూర్లో క్రైస్తవులపై మతోన్మాదుల దహన కాండకు నిరసనగా వీరవాసరంలో సోమవారం ఐక్య క్రైస్తవ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. వీరవాసరం పంట కాలువ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ఎం సుందర్ రాజుకు వినతి పత్రాలు అందజేశారు. మణిపూర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలని కోరారు. మణిపూర్‌లో 400 చర్చిలను కూల్చి వేసి యుద్ధం సృష్టిస్తూ 190 గ్రామాలు తగలబెట్టి, 200 మందిని పైగా హత్య చేశారని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కె.రత్నంరాజు, మానుకొండ ప్రదీప్ కుమార్, నేతల జాన సుందర్ రాజు, బొంతు రమేష్, చికిలే మంగతాయారు, గడ్డం భాస్కరరావు, చిక్కాల రాజు పాల్గొన్నారు.

**విస్సాకోడేరు పారిష్ ఆధ్వర్యంలో..**

**పాలకోడేరు:** మణిపూర్‌లో క్రైస్తవ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన వారిని ఉరితీయాలని విస్సాకోడేరు పారిష్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్, ప్రధాని నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

**క్రైస్తవులకు రక్షణ కల్పించాలి**

**భీమవరం అర్బన్:** క్రైస్తవులకు రక్షణ కల్పించి శాంతిని కలుగజేయాలని గొల్లవానితిప్ప గ్రామ పాస్టర్లు కోరారు. మణిపూర్‌లో అల్లర్లకు నిరసనగా గొల్లవానితిప్ప పరిశుద్ధ తోమా లూథరన్ చర్చి నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు క్రైస్తవ సంఘాలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించాయి. పాస్టర్ తాళ్లూరి రాజశేఖర్ ఎం.ఆమోస్, ఎస్ ఫిలిప్ రమేష్ సత్య ప్రకాష్, ఆర్ రాజు, క్రీస్తు దాసు, పి.సామ్యూల్ పాల్, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, అడ్వకేట్ ఎస్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ బుంగా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి మళ్లింపు చర్యలు

**ఉండి:** మండలంలోని చెరుకువాడ గ్రామ లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యటు చేపట్టినట్టు సర్పంచ్ కొండవేటి సాంబశివరావు తెలిపారు. సోమవారం గ్రామంలోని చినపేట, కాపులపేట, ఎస్సీ ఏరియాల్లో చేపట్టిన వర్షపునీటి మళ్లింపు పనులను ఆయన పర్యవేక్షించారు. కచ్చా డ్రెయిన్లలో మట్టి పూడుకుపోయి కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముందుగా నిల్వ నీటిని తొలగిస్తే దోమల బెడద ఉండదని, జ్వరాలు, రోగాలు రాకుండా ఉంటాయనే ఉద్దేశంతో పారిశుధ్య పనులు చేపట్టామని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యవేక్షణలో గ్రామంలో అనేక లోతట్టు ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ, ఎంపీటీసీ చిరుగుపాటి కృష్టాఫర్, బొడ్డు నాగన్న, వార్డు సభ్యులు, కార్యదర్శి కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నీటి మళ్లింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సాంబశివరావు

### స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ రాజు

**సాక్షి, భీమవరం:** స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సర్వే నిర్వహించాలని రెండు, పాలకోడేరు మండలం మోగల్లు పంచాయతీలో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని, పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేయాలని రెండు వినతిపత్రాలు అందాయన్నారు. వీటిని తక్షణం పరిష్కరించాలని ఆర్డీవో రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఉద్యోగాల కల్పనలో చరిత్ర సృష్టించిన జగన్

**ఉండి:** నిరుద్యోగ యువతకు గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సోమవారం ఉండి పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఏఎన్ఎం (హెల్త్ అసిస్టెంట్)లకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇంక్రిమెంట్ మంజూరు పత్రాలను ఎంపీపీ అందజేశారు. సంక్షేమ పాలన సజావుగా సాగడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. హెల్త్ అసిస్టెంట్లను గతేడాది జూలైలో పర్మినెంట్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, వారికి ఏడాది కాలానికి మొదటి ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయడం సంతోషకరని వివరించారు. జగన్ పాలనకు ప్రజలు జేజేలు పలుకుతుంటే ప్రతిపక్షాలు ఓర్చుకోలేకే నానాయాగీ చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, మండల వైద్యాధికారి పి.ధర్మతేజ్, కృష్ణకుమార్, టి.గోపి తదితరులు పాల్గొన్నారు.



ఇంక్రిమెంట్ మంజూరు పత్రం అందిస్తున్న ఎంపీపీ ఇందుకూరి, డాక్టర్ ధర్మతేజ్

# లయన్స్‌క్లబ్ కార్యవర్గాల ప్రమాణస్వీకారం

**సాక్షి, భీమవరం:** సామాజిక సేవ చేసేవారిని మరింతగా ప్రోత్సహించడం అభినందనీయమని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరం పట్టణం, పాలకోడేరు లయన్స్ క్లబ్స్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా నడింపల్లి మహేష్‌వర్మ, బొండా రామకృష్ణ (రాంబాబు), కోశాధికారిగా కోట్ల నాని, క్లబ్ పాలకోడేరు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ముదునూరి వెంకటరాజు, సన్నిధి పాశేశ్వరరావు, కోశాధికారిగా జి.పురుషోత్తంలతో ఇన్స్టాలేషన్ ఆఫీసర్ చిలుకూరి కృష్ణంరాజు, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు, రీజియన్ చైర్మన్ దాట్ల రామరాజు, జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, డాక్టర్ జి.గోపాలరాజు, భీమాల శ్రీరామమూర్తి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి కనకరాజు, విమల్ సకరియా, వేగిరాజు విశ్వనాథరాజు, పేర్ని సుబ్రహ్మణ్యం, నరహరిశెట్టి కృష్ణ, కొత్తపల్లి శివరామరాజు, తాళ్లూరి త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.



లయన్స్‌క్లబ్ సమావేశంలో డాక్టర్ బాబ్జిని సత్కరిస్తున్న దృశ్యం

### నేడు క్రైస్తవుల నిరసన ర్యాలీ

**సాక్షి, భీమవరం:** మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తూ భీమవరంలో క్రైస్తవ, క్రైస్తవేతర మైనార్టీ వర్గాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ క్రైస్తవ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక లూథరన్ హైస్కూల్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### డీఎన్నార్‌లో బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమం





సదస్సులో మాట్లాడుతున్న ఉదయ్‌తేజ

**సాక్షి, భీమవరం:** ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను ఉపయోగించే సమయంలో ప్రజలను మోసగించే ఉద్దేశంతో ఫిషింగ్, మోసపూరిత పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌తేజ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా లీడింగ్ డిస్ట్రిక్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్ సూచించారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈబాట్ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్నెస్ అండ్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లావాదేవీల ప్రయోజనాలు, డిజిటల్ బ్యాంకింగ్ ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణం కోరుతూ వినతి

**సాక్షి, భీమవరం:** మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ యు.రవి ప్రకాష్‌కు సోమవారం ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికి ముక్కు సుబ్బయ్య మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో రిజర్వేషన్లు, ఇతర హక్కుల కోసం రెండు జాతుల మధ్య తగాదాలు తలెత్తాయన్నారు. అక్కడ మతపరమైన విషయం ఏమీ లేకపోయినా కొన్ని రాజకీయ పార్టీలు, కొందరు మతోన్మాదులు కొన్ని వర్గాల వారిని రెచ్చగొట్టేలా మతం రంగులు పులుముతున్నారని ఆరోపించారు. ఈ తరుణంలో మన జిల్లాలో ర్యాలీలు, నిరసనలకు అనుమతులు లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో మట్టపర్తి మురళీకృష్ణ, మజ్జి మహేష్, గొంతిన శ్రీనివాస్, గూడూరి సాంబమూర్తి, వనమా శ్రీకాంత్, గొంతిన సుగ్రీవ్, తాతారావు, హరిప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ రవిప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

### న్యాయవాదులు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న రంగారావు

**సాక్షి, భీమవరం:** విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది అదిశేషు విఠల్‌బాబు హత్యను నిరసిస్తూ సోమవారం భీమవరం బార్‌కౌన్సిల్, ఐఏఎల్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ న్యాయవాది విఠల్‌బాబు కిడ్నాప్‌చేసి హత్యచేయడం దారుణమన్నారు. ఇటీవల కాలంలో తరచు న్యాయవాదులపై దాడులు, హత్యలు, తప్పుడు కేసులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు పార్లమెంట్‌లో రక్షణ చట్టం బిల్లును పాస్ చేయాలని, న్యాయవాదుల రక్షణకు కనీస చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పాక రమేష్‌బాబు, కోశాధికారి బి.అశోక్ బాబు, రమేష్, మేకా శివ, రాఘవేంద్రరావు, రోషన్ రాజేష్, మల్లుల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

### రైతు ప్రయోజనాలే లక్ష్యం

**పాలకోడేరు:** రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే ముఖ్యమంత్రి జగనన్న జగనన్న భూహక్కు, భూరక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు ఎంపీపీ చైర్మన్ భూపతిరాజు చంటిరాజు అన్నారు. సోమవారం పాలకోడేరు, వేంద్ర గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో డ్రోన్ల ద్వారా భూముల సర్వే పూర్తయిందని, తొలుత రైతులకు 9(2) నోటీసులిచ్చి 15 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించామని తెలిపారు. తర్వాత జాయింట్ కలెక్టర్ 13 నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. వేంద్రలో 869.77, పాలకోడేరులో 1178.95 ఎకరాలుగా గుర్తించామన్నారు గొల్లలకోడేరు గ్రామంలో భూసర్వే ప్రారంభించనున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో రీ సర్వే డీటీ సూర్యనారాయణ రాజు, గ్రామ సర్పంచ్ కడలి నాగేశ్వరి, ఎంపీటీసీ పాల జ్యోతి చిన్నా, కుక్కల సాయి కృష్ణ, వీఆర్వో అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.